



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా భూ సమస్యలు, పెన్షన్లకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులను అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, మొత్తం 105 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

ప్రజావాణిలో 102 ఫిర్యాదులు

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, జూలై 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి తెలిపారు. వారు డీఆర్‌వో హరిప్రియతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పదవుల పందేరం!

సవాల్‌గా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం

స్థానిక ఎన్నికలకు ముందే అధికార కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పీసీసీ నియమించిన సంగతి తెలిసిందే. సంస్థాగత నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసేందుకు సోమవారం ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డిని పార్టీ అధినాయకత్వం నియమించింది. అలాగే గ్రామ స్థాయి నుంచి జిల్లా కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టింది. భారీ సంఖ్యలో ఆశావహులు ఉండటంతో ఎంపిక ప్రక్రియ పార్టీ నాయకత్వానికి సవాల్‌గా మారింది.

- స్థానిక ఎన్నికలకు ముందే పోస్టులన్నీ భర్తీ
- గ్రామస్థాయి నుంచి జిల్లా కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు
- భారీ సంఖ్యలో ఆశావహులు..
- తలనొప్పిగా ఎంపిక ప్రక్రియ
- మండల అధ్యక్ష పదవులకూ పదుల సంఖ్యలో దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా శివసేనారెడ్డి నియామకం



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలను ప్రకటించిన వెంటనే వారితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ సోమవారం జూమ్ మీటింగ్ కూడా నిర్వహించడం గమనార్హం. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుపై విధివిధానాలు వారికి వివరించారు. పార్టీ సంస్థాగత నిర్మాణ పక్రియను ప్రారంభించేందుకు వెంటనే రంగంలో దిగాలని ఆదేశించారు. దీంతో కొన్నాళ్లుగా నానుస్తూ వచ్చిన సంస్థాగత ఎన్నికల పక్రియ త్వరలోనే పూర్తికానుంది. అయితే సంస్థాగత ఎన్నికల నిర్వహణ పార్టీకి పెద్ద సవాల్ అనే చెప్పాలి. రాజకీయంగా ఎంతో కీలకమైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర

మిగతా 7వ పేజీలో...

అధ్యక్ష పదవులకు పోటా పోటీ

పార్టీ పదవుల పంపకంపై క్షేత్రస్థాయిలో పార్టీ అధినాయకత్వం అభిప్రాయ సేకరణ నిర్వహించి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వీటికి పలు నియోజకవర్గాల్లో భారీ స్పందన లభించింది. మండల, బ్లాక్ అధ్యక్ష పదవులకు పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. డీసీసీ అధ్యక్ష పదవులకు కూడా భారీగానే డిమాండ్ ఉంది. పలువురు కీలక నేతలు ఈ పదవులను ఆశిస్తున్నారు. పదవుల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో వీరి ఎంపిక నాయకత్వానికి సవాల్‌గా మారనుంది. దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి అర్హత ఉన్న నేతల పేర్లను సిఫారసు చేస్తూ జాబితాను పీసీసీకి పంపారు. గ్రామ, మండల అధ్యక్ష పదవులకు సంబంధించి ఐదుగురు పేర్లను, బ్లాక్ అధ్యక్ష పదవులకు ముగ్గురు పేర్లను టీపీసీసీకి పంపారు. పదవుల పంపిణీలో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల అభిప్రాయ సేకరణ చేసిన సమయంలో పరిశీలకులు ఆశావహులతో భేటీ అయి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని చెప్పారు. పార్టీ నిర్మాణానికి తోడ్పడిన వారి భవిష్యత్తు పార్టీ చూసుకుంటుందని భరోసా ఇచ్చారు.



ఉల్లిసాగు ఎకరాకు రూ.8వేల సాయం

» రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్, జూలై 7, (ఆంధ్రజ్యోతి):ఉల్లి సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు రూ.8వేల ఆర్థిక సాయం అందించినున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి సత్తార్ తెలిపారు. ఉద్యానవన మిషన్ ద్వారా ఈ సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ సాయాన్ని పొందాలనుకునే రైతులు పంట వేసిన వెంటనే సంబంధిత ఏఈవో వద్ద పంట వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఒక రైతుకు కనీసం ఎకరా నుంచి 5 ఎకరాల వరకే వర్తిస్తుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో పట్టాదారు పాస్ పుస్తకం తోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుకు మరో వారం రోజులు మాత్రమే గడువు ఉందన్నారు.


మట్టి గణపతులనే పూజించాలి

» బీసీ సంక్షేమశాఖ అధికారి ఉపేందర్

వికారాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుమ్మరి కుల వృత్తిని ప్రోత్సహించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులనే పూజించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్ సూచించారు. వినాయక చవితి పురస్కరించుకొని మట్టి వినాయకులు కావాల్సిన వారు దిగువ తెలిపిన వ్యక్తుల వద్ద నుంచి మట్టి గణపతులను పొందాలని సూచించారు. కొడంగల్‌లో అంజిలయ్య 9391645200, తాండూరులో కుమ్మరి శ్రీశైలం 9640518846, పరిగిలో కుమ్మరి గౌరీ శంకర్ 9676038986, వికారాబాద్‌లో కుమ్మరి అంజిలయ్య 9966466982ను సంప్రదించాలన్నారు.

గుడ్డు ఉడుకుతలే!

భారీగా పెరిగిన కోడిగుడ్డు ధర







- మార్కెట్‌లో రూ.7కు చేరిన రేటు
- గ్రామాల్లో రూ. 8కు విక్రయిస్తున్న వ్యాపారులు
- ఆందోళనలో పేద వర్గాలు
- అయినా రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్

పరిగి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్ల ధరలు కొండెక్కాయి. అందనంత దూరానికి రేట్లు ఎగబాకాయి. చికెన్, మటన్ ఎలాగూ కొనలేని నిరుపేదలు పెరిగిన ధరలతో నేడు కోడిగుడ్డు వైపు కూడా చూసే పరిస్థితి లేకుండా పోయింది. మాంస, శాఖాహారులందరూ పౌష్టికాహారంగా తీసుకునే గుడ్డు ఇప్పుడు పేదలు తినలేనంత దూరంగా పోయింది. ఇంతగా ధరలు పెరుగుతున్నప్పటికి గుడ్లకు డిమాండ్ ఏ మాత్రం తగ్గడం లేదు. రాష్ట్రంలో గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో పాటు, ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి కారణంగా ధరలు పెరిగిపోతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఈ సమయంలో

మిగతా 8వ పేజీలో...



గుడ్డు ధరను నియంత్రించాలి

మాంసం, చికెన్ కొనలేని పరిస్థితుల్లో గుడ్డును విరివిగా తినేవాళ్లం. ఇప్పుడు గుడ్డు ధర రూ.7కు చేరింది. ఇంతవరకు ఇంత ధరను ఎప్పుడూ చూడలేదు. ప్రభుత్వం గుడ్ల ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి.

-మనీషా, గృహిణి, పరిగి

900 క్వింటాళ్ల రేషన్ బియ్యం పక్కదారి

విజిలెన్స్ అధికారుల తనిఖీలతో వెలుగులోకి..

ఐదుగురు అధికారుల సస్పెండ్



మేడ్చల్, జూలై 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం కొందరు అవినీతి అధికారుల తీరుతో పక్కదారి పడుతున్నాయి. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో 900 క్వింటాళ బియ్యం పట్టుబడ్డాయి. ఈ విషయం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలోని కాప్రా, రామంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు పేదలకు అందాల్సిన 900 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విక్రయించేందుకు పన్నాగం పన్నారు. స్టేజ్ వన్ గోదాంల నుంచి బియ్యం ఎమ్ఎల్ఎస్ పాయింట్లకు చేరుతుంది. అక్కడి నుంచి డీలర్లకు, డీలర్ల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. గోదాముల నుంచి ఎమ్ఎల్ఎస్ పాయింట్లకు

మిగతా 8వ పేజీలో...

77 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు

» జిల్లా వైద్యాధికారి లలితాదేవి

» ఆరోగ్య కేంద్రాల్లో స్క్రీనింగ్ శిబిరాలు



వికారాబాద్ ఆస్పత్రిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

వికారాబాద్/పూడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రెండు క్యాంపులలో నిర్ధారించిన లోపాలున్న77 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి లలితాదేవి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి, పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పుట్టుకతో వచ్చిన లోపాలు, ప్రమాదాలు, ఇతర కారణాల వల్ల ఏర్పడిన లోపాలు గల వారిని గుర్తించేందుకు స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించారన్నారు. వికారాబాద్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన శిబిరంలో 54 మంది వివిధ లోపాలు గల వారిని స్క్రీనింగ్ చేసి 42 మందికి, పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్క్రీనింగ్ శిబిరంలో 56 మందిని పరీక్షించగా 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో ఆకార్ ఆశ సంస్థ ప్రతినిధులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవికరెడ్డి, వికారాబాద్ పట్టణ ఆరోగ్య కేంద్రం కొత్తగడి, రామయ్యగూడ, పూడూరు, చెన్‌గోముల్ వైద్యులు, డాక్టర్ మహ్మద్ ఫారూక్, డాక్టర్ సృజన, ఎంఎల్‌హెచ్‌పీఎస్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



రేపు జాబ్‌మేళా

వికారాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టీం లీస్ సర్వీసెస్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్(వికారాబాద్) నందు రేపు(జూలై 9, బుధవారం) ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీ -మార్ట్‌లో సుమారు 200(క్యాషియర్, సేల్స్ అసోసియేట్స్) పోస్టులు ఉన్నాయన్నారు. వాటికి కనీస వయస్సు 18-24 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి అంతకంటే ఎక్కువ(పాస్ లేదా ఫెయిల్), విద్యా అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ జాబ్‌మేళా ద్వారా ఎంపిక అయినా వారికి హైదరాబాద్‌లో నేరుగా ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు నిర్వాహకులు మియాసాబ్ (9676047444)ను సంప్రదించాలని పేర్కొన్నారు.



జుంటివాగు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు

జుంటువాగు కబ్జా?

శిఖాన్ని ఆక్రమిస్తున్న సమీప భూమి కొనుగోలుదారు

- బఫర్‌జోన్‌లో అక్రమంగా నిర్మాణాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సమీప రైతులు



శిఖంలో పోసిన మట్టి

బషీరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తాండూరు - బషీరాబాద్ మార్గంలోని జుంటివాగు కబ్జాకు గురవుతోంది. సమీపంలో భూమి కొనుగోలు చేసిన యజమానులు వాగు శిఖాన్ని మాయం చేస్తున్నారు. దీంతో వాగు శిఖాన్ని కాపాడాలని పరిసర ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. కబ్జాలతో జుంటువాగు ఆనవాళ్లు కోల్పోయి కుచించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జుంటువాగు ప్రాంతం తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాల శివార్లకు అనుకుని ఉండటంతో ఈ వాగుపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతం చెక్‌డ్యాం సమీపంలో వాగు గుండా గల సర్వే నంబర్ 52, 53, 58లలో

మిగతా 8వ పేజీలో...



ది వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌కు నోటీసులు

- నేడు అన్ని అక్రమ రిసార్ట్‌లకూ..
- సర్పన్‌పల్లి ఘటనతో మూసివేత
- తాళాలు వేసుకొని తలదాచుకున్న నిర్వాహకులు

7

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

» తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్

యాలాల, జూలై 7, (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం యాలాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా విని, ఓటరు నమోదు ప్రక్రియలో శ్రద్ధగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, ఆర్ఐలు వేణు, శివచరణ్, మాస్టర్ ట్రైనర్లు వీరేశం, బస్వరాజ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పేదరాలి మృతదేహానికి గ్రామస్తుల అంత్యక్రియలు



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండాపూర్ గ్రామంలో నిరుపేద మహిళ సుమిత్రమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబీకులకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడ్డారు. దీంతో మాజీ సర్పంచ్‌లు శివరాజ్, కేశవరావు, కౌసల్య, నర్సింహులు, మరికొందరు తలా కొంత డబ్బు పోగుచేసి ఆమె కొడుక్కు ఇచ్చారు.గ్రామంలోని వైకుంఠధామంలో సుమిత్రమ్మ దహన సంస్కారాలను నిర్వహించారు. మృతురాలి కుటుంబీకులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం



బహుమతులు అందజేస్తున్న ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

షాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎలుగంటి వెంకట్‌రెడ్డి అన్నారు. ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా షాబాద్‌లో పీఆర్ఆర్ స్టేడియంలో నిర్వహించి క్రికెట్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏఎంఆర్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు రాహుల్‌గుప్తా, గౌరీశ్వర్, శ్రీనివాస్, రఫీక్, మహేశ్, గౌతమ్, దయాకర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జీవో 282ను రద్దు చేయాలి



జీవో ప్రతులను దహనం చేస్తున్న కార్మికులు

కీసర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన జీవో 282ను రద్దు చేయాలని నాగారం మున్సిపల్ కార్మికులు సోమవారం గోధుమకుంటలో ఆందోళనచేశారు. కార్మిక చట్టాలప్రకారం రోజుకు 8గంటలే పని చేస్తామన్నారు. కొత్త జీవో 282 ప్రకారం కార్మికులు రోజుకు 10 గంటలు పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలారాసేలా కొత్త జీవో తెచ్చారని, ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులు ఏకమై ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

ఒక్క గది.. ఐదు తరగతులు.. ఒక్కడే టీచర్!

- రాంపూర్ మీది తండాలో ఏడేళ్లుగా ఏకోపాధ్యాయుడి బోధన
- ఉన్న ఒక్క సార్ సెలవు తీసుకుంటే పాఠశాలకు సెలవే!



ఐదు తరగతుల విద్యార్థులకు ఒకే గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తాండూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ మీది తండా పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఐదు తరగతులకు అతడే బోధిస్తున్నాడు. అత్యవసర సమయాల్లో ఆ టీచర్ లీవ్ పెడితే పాఠశాలకు సెలవే అన్న చందంగా పరిస్థితి ఉంది. ఈ స్కూల్‌కు కనీసం ఇద్దరు టీచర్లనయినా నియమించాలని తండా వాసులు కోరుతున్నారు. ఈ పాఠశాల 2018 నుంచి ఏకోపాధ్యాయ పాఠశాలగా కొనసాగుతోంది. అన్ని తరగతుల్లో కలిపి 31మంది విద్యార్థులున్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.మనోహర్ ఉత్తమ బోధనతో గత సంవత్సరం నిత్య, ప్రవళిక, తనూజ, సాయికిరణ్, అజయ్ అనే విద్యార్థులు సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో సీటు సాధించారు.

తరగతి గదులను నిర్మించాలి

పాఠశాలకు అదనపు గది కావాలని ఉన్నతాధికారులకు విన్నవించినా మంజూరు చేయడం లేదు. స్కూలుకు కిచెన్ షెడ్ లేదు. హెచ్‌ఎం.. ఎంఈవో కార్యాలయానికి, క్లస్టర్ సమావేశానికి వెళ్లినా.. సెలవు తీసుకున్నా విద్యార్థులకు బోధించే వారు లేకుండాపోతున్నారు. ఉన్నతాధికారులు మరో ఉపాధ్యాయుడిని లేదా వలంటీరునైనా నియమించాలని, పాఠశాలకు అదనపు గదులు నిర్మించాలని తండా వాసులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే సంక్షేమ ఫలాలు



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

శంకర్‌పల్లి, జులై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటాలతోనే తెలంగాణ సమాజానికి సంక్షేమ ఫలాలు దక్కాయని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు ప్రొద్దుటూరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు జెండాను ఆవిష్కరించి సమితి వ్యవస్థాపక మంద కృష్ణ పుట్టిన రోజు వేడుక సందర్భంగా కేక్ కట్‌చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల గొంతుక మందకృష్ణ అని కొనియాడారు. 30ఏళ్ల పోరాటాన్ని ఆయన ప్రజల్లో సజీవంగా ఉంచి, రాజీలేని పోరాటం చేసి విజయం సాధించారని అన్నారు. దేశ వ్యాప్తంగా పీడిత వర్గాలను ఏకం చేసి అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో పనిచేస్తామని మరితం ఉత్సాహంగా పనిచేస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సింహ, మల్లారెడ్డి. భానుప్రసాద్. రఘుపతిరెడ్డి, మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, జంగారెడ్డి, గోపాల్, శ్రీకాంత్, లింగం పాల్గొన్నారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద ఇళ్లు కేటాయించాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నందనవనం కాలనీ వాసులు

రంగారెడ్డి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇళ్ల కోసం నందనవన వాసులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్‌లోని నందనవనంలో ధీర్ఘకాలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న తమ గుడిసెలను తొలగించి, అక్కడ జేఎన్ఎన్‌ఎంయూఆర్‌ఎం పథకం కింద అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఇండ్లను రిపేర్ చేసుకుని ఐదేళ్లుగా వాటిల్లో జీవిస్తున్నామని, వాటికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మస్జిద్‌పూర్ వాసులు ...

గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మస్జిద్‌పూర్ వాసులు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఇంటి స్థలాలు లేక ఎంతో మంది పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని, తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

వికారాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, అక్బర్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజు కట్టనిదే విద్యార్థులకు హాల్ టికెట్లు, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తేజ, పవన్, అభిషేక్, సిద్ధార్థ, కార్తీక్, బద్రీనాథ్ పాల్గొన్నారు.

మహిళా శక్తి ద్వారా బస్సులు కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వికారాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి ద్వారా పెట్రోల్ బంకులు, క్యాంటీన్ల నిర్వహణ, బస్సుల కొనుగోలు చేయాలని సీఈవో సూచనలు జారీ చేశారని ఏడీఆర్‌డీవో నర్సింలు తెలిపారు. సోమవారం జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. 60 సంవత్సరాలు నిండిన సభ్యులతో కొత్త సంఘాల ఏర్పాటు, దివ్యాంగుల సంఘాల బలోపేతంపై చర్చించారు. 15 నుంచి 18ఏళ్ల లోపు బాలికలను సంఘాల్లో చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. 8న మండల స్థాయిలో సంబురాలు, 9న వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డీపీఎంలు కొమరయ్య, నర్సిములు, శేఖర్, నర్సిములు, జిల్లా సమాఖ్య ఓబీలు జానకి శ్వేత, భాగ్యలక్ష్మి, ఓబీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులివ్వాలి


చేవెళ్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీల్లో అన్ని క్యాడర్లలో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
AMB ఎ.ఎం.బి సినిమాస్ 70 - గచ్చిబౌలి
ఏషియన్ సత్యం 70 - అమీర్‌పేట్
లక్ష్మీకళ సినిప్లెడ్ 70 ఎ/సి - మూసాపేట్
GLOBAL CINEMAS RELEASE

జూలై 11న బ్రహ్మాండమైన విడుదల


సాయిరాజా 70 ఎంఎం - ముషీరాబాద్
TRIPURA CREATIONS THRU PARAMJYOTHI FILMS 9848028739

విజయవంతమైన 2వ వారం


అంజలి 70 - సికింద్రాబాద్ 11.15,2.15,6.00,9.00

SUPER HIT నేడే చూడండి


MYTHRI MOVIE DISTRIBUTORS LLP

BLOCKBUSTER PROMISE


సుదర్శన్ 35 - ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

విజయవంతమైన 3వ వారం


సంధ్య 35 - ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

SUPER HIT నేడే చూడండి


ఆరాధన 70 ఎంఎం - తార్నాక 11.00,2.00,6.00,9.00
తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00
GLOBAL CINEMAS RELEASE



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ

మహేశ్వరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ పరిరక్షణతో పాటు విద్యుత్ బస్సుల విధానంలో మార్పు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు తదితర సమస్యలపై జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మహేశ్వరం డిపో ఎదుట సమ్మె బుక్‌లెట్ కరపత్రాలను ఆర్టీసీ కార్మికులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. 29 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. కోడ్‌లు అమలైతే కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, ఉమ్మడి బేరసారాలు, సమ్మె హక్కులు పూర్తిగా కోల్పోతారన్నారు. అప్పుడు కార్మికులు కట్టు బానిసలుగా పని చేయాల్సి వస్తుందని, అంతేకాకుండా అవుట్ సోర్సింగ్, అప్రెంటీస్ విధానంతో నియామకాలు చేపడతారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి నిర్వహణ బాధ్యత, సబ్సిడీలు ఆర్టీసీకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు వాటర్ క్యూరింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సీసీ రోడ్డుపై నీళ్లు పట్టిస్తున్న కాంట్రాక్టర్

ఘట్‌కేసర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలోని బి-2లో సోమవారం కాంట్రాక్టర్ సీసీ రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేశారు. 'సీసీ రోడ్డు వేశారు.. నీళ్లు పట్టడం మరిచారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో రోడ్డుకు నీరు పట్టించారు. ఎన్ఎఫ్‌సీ నగర్ కాలనీ బి-2లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డుకు కాంట్రాక్టర్ నీళ్లు పట్టించడం లేదు. సీసీ పగుళ్లిడ్చి నాణ్యత లోపిస్తోంది. ఇదే విషయమై కాలనీవాసులు అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. దీంతో కొందరు ఇళ్ల యజమానులు వారిళ్ల ముందు నీరు పట్టారు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌తో నీళ్లు పోయించారు. కొత్త సీసీ రోడ్డుకు పది రోజులైనా నిత్యం నీరు పట్టాలని, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌కు నోటీసులిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. అధికారులు సీసీ రోడ్డుపై మట్టికట్టలతో మడులు కట్టించి నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అభివృద్ధిని గాలికొదిలిన కాంగ్రెస్

మహేశ్వరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ, పైరవీలకే ప్రాధాన్యమిస్తోందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. పెద్దమ్మ తండా-కొత్తూరు జరుగుతున్న రోడ్డు పనులను అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో సోమవారం ఆమె పరిశీలించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ పాలనలో చేసిన పనులేమీ కన్పించడంలేదన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి బీఆర్ఎస్ ప్రభుత్వం వందలాది కోట్లు విడుదల చేస్తే ఆ పనులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసి రాక్షసానందం పొందుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మరో హామీని అమలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు రూపాయి కూడా విడుదల చేయలేదని, రోడ్లపై భారీ గుంతలతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రభుత్వాన్ని నడిపే అవగాహన లేదన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాండుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, అంబయ్య, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నారాయణగౌడ్

గీత కార్మికుల పొట్టగొడితే సహించం

ఘట్‌కేసర్ రూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికుల పొట్ట కొడితే సహించేది లేదని అఖిల భారత గౌడసంఘం అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ హెచ్చరించారు. కొర్రెముల కల్లుగీత కార్మికుల కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా సోమవారం రెండో రోజుకు చేరింది. ధర్నాకు నారాయణగౌడ్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. రియల్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా తాటిచెట్లు నరికేస్తూ కల్లు గీత కార్మికుల ఉపాధికి దెబ్బ కొడుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెట్లను నరికిన వారు పరిహారం కింద చెట్టుకు రూ.50వేల చొప్పున ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరేళ్ల వేములయ్యగౌడ్, కొర్రెముల గీత కార్మికుల సొసైటీ అధ్యక్షుడు దర్శన్‌గౌడ్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, పాండుగౌడ్, అనిల్‌గౌడ్, బాబురావుగౌడ్, బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.



ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న రాజేశ్‌రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బొంరాస్‌పేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. లింగన్‌పల్లిలో సోమవారం లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేసి ఇంటి నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు గొప్పవన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, కృష్ణ, కాశప్ప పాల్గొన్నారు.



నాట్య మయూరి

కోట్‌పల్లి మండలం రాంపూర్ శివారు అటవీ ప్రాంతంలో సోమవారం నెమలి పురివిప్పి నాట్యం చేసింది. ఆకాశం మేఘావృతమైన సమయంలో మయూరి కొద్దిసేపు నాట్యమాడింది.

\- కోట్‌పల్లి, జులై 7(ఆంధ్రజ్యోతి)

ది వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌కు నోటీసులు

నేడు అన్ని అక్రమ రిసార్ట్‌లకూ అందజేత

సర్పన్‌పల్లి ఘటనతో రిసార్ట్‌ల మూసివేత

తాళాలు వేసుకొని తలదాచుకున్న నిర్వాహకులు



వికారాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ రిసార్ట్‌ల నిర్వాకాన్ని ఎప్పటికప్పుడు పత్రికలు, మీడియా బయటపెడుతున్నా అధికారుల అండతో నిర్వాహకులు వ్యాపారాన్ని ఆపడంలేదు. కాగా సర్పన్‌పల్లి ప్రాజెక్టులో పడవ ప్రమాదంలో బిహార్‌కు చెందిన ఇద్దరు మహిళా పర్యాటకులు చనిపోవడంతో రిసార్ట్స్ నిర్వాహకుల ఆగడాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఇంత జరిగినా అధికారులు రిసార్టుల జోలికి పోలేని స్థితిలో ఉన్నారంటే ఎంత స్థాయిలో మేనేజ్ చేస్తున్నారో తెలుస్తోంది. సోమవారం పంచాయతీ కార్యదర్శి స్వాతి 'ది వైల్డర్ నెస్ రిసార్ట్స్'కు నోటీసులిచ్చారు. అలాగే అనుమతుల్లేని అన్ని రిసార్ట్‌లకు నేడు నోటీసులిస్తారని తెలుస్తోంది. చెరువు పరిసరాల్లో ఆరు రిసార్ట్‌లుండగా ప్రస్తుతం వాటికి తాళాలు వేసి నిర్వాహకులు పరారయ్యారు. అక్రమాలు, ప్రమాదాలు జరిగిన సమయాల్లో గతంలోను రిసార్ట్‌లను సీజ్ చేసినా.. నిర్వాహకులు ఏదో విధంగా మేనేజ్ చేసి నెల రోజుల్లోనే తెరిచారు. అక్రమ రిసార్టుల్లో పోలీసుశాఖ నూతన సంవత్సర వేడుకలకు సైతం అనుమతిస్తోందంటే నిర్వాహకులు ఏ మేర ముడుపులిస్తున్నారో అర్థమవుతోంది. అసైన్డ్ భూముల్లో రిసార్ట్‌లు కట్టినా రెవెన్యూ శాఖ కన్నెత్తి చూడడం లేదు. ఇద్దరు మహిళల మృతి నేపథ్యంలో అయినా అక్రమ రిసార్టులపై కఠిన చర్యలు తీసుకొని మరోసారి దుర్ఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు, పర్యాటకులు జిల్లా అధికారులను కోరుతున్నారు.

పదవుల పందేరం!

(ఐదో పేజీ తరువాయి)

పూర్తయినా ఇంకా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ బలపడలేదు. దీంతో క్షేత్రస్థాయిలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అత్యంత కీలకం కానుంది. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు సంఖ్య గణనీయంగా పెరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే జిల్లాపై కాంగ్రెస్ పట్టు పెంచుకోవాల్సి ఉంటుంది.

అన్ని నియోజకవర్గాల్లోనూ వర్గపోరు!

ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో ఒక్కరికి కూడా స్థానం లేకపోవడం పార్టీ ఎదుగుదలపై మరింత ప్రభావం చూపుతోంది. అలాగే పార్టీకి పెద్ద దిక్కు లేకపోవడం, ఎక్కువ మంది ఎమ్మెల్యేలు విజయం సాధించకపోవడం అధికార పార్టీకి మైనస్‌గా ఉంది. చాలా నియోజకవర్గాల్లో కేడర్‌కు ఏదైనా సమస్య వచ్చినా చెప్పుకునే నాథుడే లేరు. అన్ని నియోజకవర్గాలోనూ కాంగ్రెస్‌లో వర్గపోరు నెలకొంది. ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తరువాత ఇతర పార్టీల నుంచి కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే పాత, కొత్త నేతల మధ్య అనేక చోట్ల పొసగడం లేదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో కూడా పరిస్థితి ఇలానే ఉంది. కొత్తగా చేరిన ఎమ్మెల్యేలకు గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకు పొసగడం లేదు. వీరి మధ్య సయోధ్య కుదర్చి స్థానిక ఎన్నికల సమయంలో వీరందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీని ముందుకు నడిపే నేతలు కరువయ్యారు.

నిరాశలో పార్టీ కేడర్

మూడు జిల్లాల్లోనూ పార్టీని నడిపించాల్సిన నేతలు ఎక్కడా కనిపించడం లేదు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో మినహా మిగతా చోట్ల ఎక్కడా నేతలు సమయం కేటాయించడం లేదని పార్టీ కేడర్ నుంచి విమర్శలు వస్తున్నాయి. పార్టీలో పరిస్థితులపై కాంగ్రెస్ శ్రేణులు కూడా తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నాయి. ఇపుడు పార్టీ సంస్థాగత నిర్మాణం జరిగితే పార్టీకి కొంత జవసత్వాలు వస్తాయని శ్రేణులు భావిస్తున్నాయి. ఇది గమనించిన కాంగ్రెస్ అధినాయకత్వం కూడా సంస్థాగత ఎన్నికలను సత్వరమే పూర్తి చేయాలని భావిస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరు, పార్టీ పరిస్థితిపై క్షుణంగా అధ్యయనం చేశారు. నూతన కమిటీల ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ జరిపారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా దృష్టిసారించారు.



అభిప్రాయాల సేకరణ

పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయిలో పార్టీ అధినాయకత్వం సమావేశాలు నిర్వహించింది. పార్లమెంట్ స్థాయిలో ఒక వైస్ చైర్మన్‌తో పాటు ముగ్గురు ప్రధాన కార్యదర్శులను నియమించింది. చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా బొంతు రామ్మోహన్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా బస్వరాజ్ సారయ్యను నియమించింది. అలాగే నియోజకవర్గ స్థాయిలో జరిగే సమావేశాల్లో అభిప్రాయాలను సేకరించింది. ఇందు కోసం జిల్లాకు ఇద్దరు పరిశీలకులను పంపింది. ఇప్పటికే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సమావేశాలు ముగిశాయి.

క్రమశిక్షణకు మారుపేరు కేజీబీవీలు

» అదనపు గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికా విద్యాలయాలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండలం పులుసుమామిడిలోని కేజీబీవీలో రూ.2.3కోట్లతో నిర్మించినతరగతి గదులు, జెడ్పీ పాఠశాల సైన్స్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థినులు బోనాలు, ఆట పాటలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ.. అక్షరంతోనే జీవితం మలుపు తిరుగుతుందని, అక్షరమే విజయం వైపు నడిపిస్తుందని విద్యార్థినులకు సూచించారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థినులకు ఎమ్మెల్యే 5వేల చొప్పున పారితోషికాన్ని అందజేశారు. పాఠశాలకు ప్రహరీ, సీసీ రోడ్డు లేవని టీచర్లు ఎమ్మెల్యేను కోరగా ఆయన స్పందించి స్కూల్ సమస్యలను పంద్రాగస్టులోపు తీరుస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు ముందుకొచ్చి రూ.10పది లక్షలుపైగా విరాళాలను ప్రకటించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాల వెల్లువ...

ఎమ్మెల్యే శంకర్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి తాముసైతం తోడ్పాటు అందిస్తామని కాంగ్రెస్ నాయకులు విరాళాలు ప్రకటించారు. గుంజల్ పహాడ్ కృష్ణ షెడ్ నిర్మాణం, గోపాల్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జితేందర్‌రెడ్డిలు రూ.5లక్షలు, మల్లేష్‌గౌడ్ లక్ష చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో స్కూల్ ఎస్వో నిషీకి అందజేశారు. మంగులాల్ నాయక్, బ్యాటరి కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డిలు ఒక్కొక్కరు లక్ష చొప్పున ఇస్తామని చెప్పారు. వీరేష్‌కుమార్ గ్రంథాలయానికి ర్యాక్స్ మహిపాల్‌రెడ్డి రూ.20వేలు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీఅనురాధ, ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రి దేవి, నాయకులు షరీఫా జహంగీర్, బాబర్‌ఖాన్, ఇబ్రహీం, కృష్ణారెడ్డి, బ్యాగరి రవి, నరేందర్, పహెల్వాన్, గోవర్ధన్‌గౌడ్, యాదయ్య, నర్సింహులు, రాములుగౌడ్, జీబీ కృష్ణ, సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కస్తూర్బా విద్యార్థినులు

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నందిగామ: ప్రభుత్వం 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిందని, రైతు భరోసా 9వేల కోట్లు ఇచ్చిందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నందిగామ మండలం చేగూర్‌లో నిర్మిస్తున్న సొసైటీ భవనానికి ప్యాక్స్ చైర్మన్ గొర్లపల్లి అశోక్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిలతో భూమిపూజ చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకుందన్నారు. సొసైటీ బ్యాంకులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ పద్మారావు, నాయకులు శివశంకర్‌గౌడ్, నర్సింలు, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, బక్కన్నయాదవ్,కె.క్రిష్ణ, డి.కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, ఎం.శ్రీశైలం, ఎ.శివ, పి.బుచ్చయ్య, బుగ్గ నర్సింలు, వీరేందర్, వేణు, ప్యాక్స్ డైరక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మహేందర్‌కుమార్‌రెడ్డి

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలుస్తారు

తలకొండపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి మనిషిని కాపాడేందుకు రక్తదానం చేసేవారు ప్రాణదాతలుగా నిలుస్తారని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డి అన్నారు. యువతీ, యువకులు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. లింగరావుపల్లిలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి, అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌లతో కలిసి మహేందర్‌కుమార్‌రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 36 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి బ్లడ్ బ్యాంకుల ద్వారా ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, కోషాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా చైర్మన్‌లు ఎం.అంజయ్య, ఓంకారం, జె.రమేశ్, రక్తదాత బి.అంజిరెడ్డి, క్లబ్ సభ్యులు పాండురెడ్డి, పి.అంజయ్య, మోహన్‌రెడ్డి, విండో చైర్మన్ కేశవరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయంతి చారి

14, 15, 16 తేదీల్లో చండీయాగం

పరిగి, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని తుల్జాభవన్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించే పంచకుండాత్మక చండీయాగాన్ని విజయవంతం చేయాలని జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు లోకూర్తి జయంతిచారి కోరారు. సోమవారం పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చక సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అర్చకులంతా యాగానికి హాజరు కావాలన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు కల్యాణ్‌రావు, శ్రీకాంత్, జగదీశ్వర్‌చారి, శివానందం, అఖిలేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీతా వాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవిసదానందరెడ్డి

రేపటి నుంచి ఆలయాల్లో భగవద్గీత పారాయణం

వికారాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు గీత వాహిని బృందం గత ఏడేళ్లుగా ప్రతీ ఆషాఢంలో భగవద్గీత పారాయణం నిర్వహిస్తోందని గీత వాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవిసదానందరెడ్డి తెలిపారు. సోమవారం శివాజీనగర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ సంవత్సరం కూడా భగవద్గీత పారాయణాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వికారాబాద్ ప్రాంతంలోని అన్ని ఆలయాల్లో గీతా పారాయణాన్ని నిర్వహిస్తామన్నారు. హిందూ బంధువులు, భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ నెల 9వ తేదీ నుంచి 17వరకు గణేష్ మండపం గాంధీకాలనీ, ఎల్లమ్మతోట-సూర్యప్రకాశ్‌కాలనీ, మల్లికార్జునాలయం-శివారెడ్డిపేట, అయ్యప్పస్వామి ఆలయం-అయ్యప్ప కాలనీ, గౌతమి కళాశాల - గరీబ్‌నగర్, రామమందిరం-ఓల్డ్ గంజ్, రేణుకఎల్లమ్మగుడి-అనంతగిరిపల్లి, హనుమాన్ ఆలయం-కొత్తగడి, వైభవలక్ష్మి ఆలయం-మారుతినగర్‌కాలనీ నిత్యం ఒక ఆలయంలో గీతాపారాయణం ఉంటుందన్నారు. సమావేశంలో గీతావాహిని ఉపాధ్యక్షులు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, కమిటీ సభ్యులు విజయ, ఝాన్సీరాణి, నీరజ, మాధురి, సంజీవరాణి, వరలక్ష్మి, సరళ, స్వాతి, సునీత, సరిత, లక్ష్మి, రజిత, మమత ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి):హస్తినాపురం-నందనవనం ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డిని లేఖ ద్వారా విన్నవించారు. ఈ లేఖను సోమవారం ప్రజావాణిలో అందజేశారు. నందనవనం పాఠశాల హైస్కూల్ స్థాయికి ఎదిగినా సబ్జెక్టుల బోధనకు స్కూల్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్లు)లు మాత్రమే ఉన్నారని, హైస్కూల్ విద్యార్థులకు ఎస్జీటీలు బోధించలేరన్నారు. గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్, హిందీ, తెలుగు సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని లేఖలో ఎంపీ కోరారు.

అదనపు కలెక్టర్‌కు దివ్యాంగుల వినతి

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వికలాంగుల హక్కుల పోరాట సమి తి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, నాగార్జున, శ్రీనివాస్‌చారి, నర్సింహాగౌడ్, యాచారం జంగయ్య, యాదయ్య, రాములు, సలీం, పాండు, ఈశ్వర్, శంకర్ తదితరులు ఉన్నారు.



ఆర్‌అండ్‌బీ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సంజీవరెడ్డి

మల్కాపూర్-సంగెంకలాన్ రోడ్డు మరమ్మతులు చేయాలి

తాండూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ నుంచి సరిహద్దులోని సంగెంకలాన్ వరకు గుంతలుపడిన ఆర్అండ్‌బీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సంజీవరెడ్డి వినతిపత్రం అందజేశారు. సోమవారం తాండూరులో గల ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఏఈతో మాట్లాడారు. రోడ్డు మొత్తం గుంతలమయమై వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. బస్సులు, కార్లు, ఆటోల మాట అటుంచితే ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేకుండా రోడ్డు తయారైందన్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేయించి సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదులో కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతీసుకొని రోడ్డును బాగుచేయించాలని విజ్ఞప్తి చేశారు.

MISSING DOCUMENTS

★ **M NIRMALA REDDY,** WIFE OF M V S REDDY (D/O LATE M L REDDY), RESIDENT OF CHEELAPUR VILLAGE, WHILE TRAVELLING FROM MY VILLAGE TO HYDERABAD BY RTC BUS LOST MY LAND (PLOT) DOCUMENT NO. 331 OF 1981, PLOT NO 47 & 48, ADMEASURING 700 SQ YARDS LOCATED IN NAGARAM VILLAGE, RANGA REDDY DISTRICT. PH 70936 03799 AJH: 222814

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

మంత్రి వివేక్‌ను కలిసిన పరిగి ఎమ్మెల్యే


మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జి.వివేక్‌ను సోమవారం సచివాలయంలో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

మహిళను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాండూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహిళను కులం పేరుతో దూషించి, మానసికంగా వేధింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. చెంగేష్‌పూర్‌లో ఎరుకల కులానికి చెందిన మహిళను మానసికంగా వేధింపులకు గురి, కులం పేరుతో దూషించారని తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, లేదంటే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బుగ్గప్ప, చంద్రయ్య, కృష్ణ, లక్ష్మణ్, సత్తయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

ఘట్‌కేసర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రోజుకు ఎనిమిది గంటల పని దినాన్ని రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు చింతల యాదయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జీకే కాలనీలో సోమవారం రోజుకు కార్మికులు 10గంటలు పనిచేయాలని సూచిస్తున్న జీవో నెంబర్ 282 ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. బుధవారం(రేపు) జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబిత, నాగమణి, అలివేలు, అరుణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌కు మంత్రి పదవి రావాలని తిరుమలలో పూజలు

పరిగి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పరిగి తాలుకా కాంగ్రెస్ నాయకులు తిరుమలలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని శ్రీవారికి మొక్కులు తీర్చుకున్నట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ తెలిపారు. శ్రీవారిని దర్శించుకుని పూజలు చేసినవారిలో లాల్‌కృష్ణతోపాటు, వెంకటరెడ్డి, కె.కృష్ణారెడ్డి, కట్కుం బాలరాజ్, రవి, పుల్లారెడ్డిలు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

దోమ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంపీడీవో గ్యామానాయక్, ఎంఈవో వెంకట్ సోమవారం తనిఖీ చేశారు. కళాశాలలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ ఆదేశాల మేరకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. కళాశాలకు ప్రహరీనిర్మాణం లేకపోవడంతో సాయంత్రం వేళల్లో, సెలవు రోజుల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ప్రిన్సిపాల్ రూపలక్ష్మి వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాధ, శ్రీవిద్య, రాములు, లక్ష్మయ్య, సునత పాల్గొన్నారు.

ప్రజావసరాలకు వదిలిన స్థలాన్ని కాపాడాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజావసరాల కోసం వదిలిపెట్టిన స్థలాన్ని కబ్జాచేసి ప్లాట్లుగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అవుశాపూర్ వినూత్న కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. అవుశాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్లు 303 నుంచి 307లలోని 43 ఎకరాల్లో 2001లో వినూత్న హైట్స్ పేరుతో లేఅవుట్ చేసి 3,878 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం లేఅవుట్ నిర్వాహకులు వదిలిపెట్టారని తెలిపారు. కానీలేఅవుట్ నిర్వాహకులు 25ఏళ్ల తర్వాత ఖాళీ స్థలాన్ని కబ్జాచేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, అయిలయ్యయాదవ్, మాదవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు

ధారూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరాచేసే ట్రాన్స్‌పార్మర్ కాలిపోయిందని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించేలా చూడాలని ధారూరుకు చెందిన రైతులు శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. వికారాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం స్పీకర్‌ను కలిసి విద్యుత్ సమస్యను వివరించారు. ధారూరులోని నేరెళ్ల చేను వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ అధికలోడ్‌తో కాలిపోయిందని, దీంతో ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న వ్యవసాయ బోర్ మోటార్లు నడవటం లేదని తెలిపారు. కాలిపోయిన ట్రాన్స్‌పార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించేందుకు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటంలేదని తెలిపారు. దీంతో స్పందించిన స్పీకర్ ట్రాన్స్‌కో ఎస్ఈ, డీఈలతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే కొత్త ట్రాన్స్‌పార్మర్ బిగించాలని ఆదేశించారు.

దాడికి యత్నించిన వారిని అరెస్టు చేయాలి

యాలాల, జూలై 7, (ఆంధ్రజ్యోతి): దళిత రైతుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్పీ నారాయణరెడ్డికి సోమవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. యాలాల మండలం హాజీపూర్ గ్రామంలో చెన్నారం రవికుమార్‌పై గోరేపల్లి గ్రామానికి చెందిన కోటం శ్రీనివాస్ పొలంను గత 2018 నుంచి కౌలుకు తీసుకుని సాగు చేసుకుని పంట వేసుకున్నాడని తెలిపారు. అట్టి పొలంలో విత్తనాలు వేస్తుండగా, గోరేపల్లి గ్రామానికి చెందిన కోటం విష్ణు, పకీరప్ప తన అనుచరులతో వచ్చి రవికుమార్‌పై కర్రలతో దాడి చేశారని, తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


సీసీ కెమెరాలు ప్రారంభం

పూడూరు, జూలై 7, (ఆంధ్రజ్యోతి): కంకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నె ఈశ్వరప్ప, సీసీ కెమెరా దాత జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ ఆధ్వర్యంలో ఈ సీసీ కెమెరాలను ప్రారంభించారు. అదేవిధంగా 200రకాల లైబ్రరీ పుస్తకాలను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్డు ఉడుకుతలే!

(ఐదో పేజీ తరువాయి)

కోడిగుడ్ల ధర తగ్గాలి. కానీ ఈ సారి ఆ పరిస్థితి లేదు. మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.7కు పైనే పలుకుతోంది. గతేడాది ఇదే సమయంలో హోల్‌సెల్ ధర రూ.5 ఉండగా, ఇప్పుడు రూ.6 పలుకుతోంది. రెండు నెలల క్రితం వరకు రిటైల్ గుడ్డు రూ.5లకే లభించేది. కానీ ప్రస్తుతం ఒక్కో గుడ్డును రూ.7 చొప్పున విక్రయిస్తున్నారు. గ్రామాల్లో అయితే ఏకంగా రూ.8 వరకు విక్రయిస్తున్నారు. పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో ప్రాంతంలో వ్యసాయానికి అనుబంధంగా బాయిలర్స్, లేయర్స్ పెంచే పెద్ద పరిశ్రమలను కూడా ఏర్పాటు చేశారు. జిల్లా బ్రాయిలర్స్, లేయర్ కలిపి 20 లక్షల కోళ్ల పెంపెకం జరుగుతుంది. అయితే వీటి ద్వారా నిత్యం ఆరు నుంచి ఎనిమిది లక్షల వరకు గుడ్ల ఉత్పత్తి జరుగుతుందని అంచనా. ప్రస్తుతం గుడ్ల ధరలు ఊహించని స్థాయిలో పెరుగుతుండడంతో



ఉత్పత్తిదారులు లాభాలతో సంతోషం వ్యక్తం చేస్తుండగా, వినియోగదారులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల ఇష్టానుసారంగా..

మార్కెట్‌లో మటన్, చికెన్ ధరలు కూడా అమాంతం పెరిగాయి. మటన్ కిలో రూ.800, చికెన్ రూ.240కిపైనే పలుకుతోంది. ఈ ధరలతో ఎక్కువ మొత్తంలో గుడ్డుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కరోనా తర్వాత వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించుకునేందుకు వైద్యులు కూడా బాయిల్డ్ ఎగ్‌ను నిత్యం తినాలని సూచిస్తున్నారు. ఇతర పోషక పదార్థాలతోపాటు గుడ్డును తప్పనిసరిగా తినడానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు మార్కెట్లో గుడ్ల ధరలను అమాంతం పెంచేస్తున్నారు.

గుడ్డులో పోషకాలు అధికం



ప్రతీ రోజు బాయిల్డ్ ఎగ్‌ను తింటే మంచిది. నాన్‌వెజ్ తిననివాళ్లు కూడా గుడ్డుకు ప్రాధాన్యత ఇవ్వండి. గుడ్డులో మంచి పోషకాలు ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. చికెన్ కంటే గుడ్డుకు రెండింతల ప్రాధాన్యత ఇవ్వాలి. కూరగాయలకు పక్కన రోజు గుడ్డును తినవచ్చు.

-డాక్టర్ ప్రవీణ్‌కుమార్,
ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో, వికారాబాద్

ఎమ్మార్పీఎస్ కృషితోనే పథకాల అమలు


వికారాబాద్: మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఆనంద్

వికారాబాద్/ధారూరు/కొడంగల్/దోమ/కులకచర్ల/తాండూరు/యాలాల/చౌడాపూర్/మేడ్చల్‌టౌన్/కీసర/ఘట్‌కేసర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ కృషితోనే అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగాసోమవారం వికారాబాద్ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మధు పాల్గొన్నారు. అదేవిధంగా ధారూరు మండలంలోని కేరెల్లిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, రాజు, అనంతయ్య, జంగయ్య, అంజయ్య పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.అంజి, శ్రీనివాస్, రమేశ్‌బాబు, రవికుమార్, దస్తప్ప, మధు, జగన్, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు. దోమ మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బందెయ్య, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, యాదయ్య తదితరులు కేక్ కట్ చేశారు. కులకచర్ల మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో మొగులయ్య, వెంకట్రాములు, వెంకటేశం, పెద్ద నర్సింహులు, లక్ష్మయ్య పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టుగల్లా ప్రశాంత్ మాదిగ, ఆనంద్ పాల్గొన్నారు. యాలాలలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మెట్లి సూర్యప్రకాష్ మాదిగ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌బీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్ మెట్లీ కృష్ణ, యాదప్ప పాల్గొన్నారు. అదేవిధంగా చౌడాపూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మొగులయ్య ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, అశోక్ పాల్గొన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ మండల ఇన్‌చార్జి పరశురాం జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి పలువురు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఘట్‌కేసర్‌లో తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేష్ మాదిగ సంఘం జెండాను ఆవిష్కరించారు.


మేడ్చల్ టౌన్: జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి


మన్నెగూడలో ఫేస్ రికగ్నేషన్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పూడూరు, జూలై 7, (ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని పూడూరు మండల వ్యవసాయాధికారి తులసీరాం సూచించారు. మండలంలోని మన్నెగూడలో సోమవారం ఫేస్ రికగ్నేషన్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ చేపట్టిందని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులకు ఓటీపీ రాకపోతే ఫేస్ రికగ్నేషన్ ద్వారా నమోదు చేస్తున్నామన్నారు. మండలంలో 19,797 మంది రైతులకు గానూ ఇప్పటి వరకు 5,026 మంది రైతులు నమోదు చేసుకున్నారు. రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నం కావడంతో కొంతమంది పట్టాదారులు ఇతర ప్రాంతాల్లో వెళ్లడం వల్ల కూడా నమోదు శాతం తక్కువగా ఉందని పూడూరు మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు.

900క్వింటాళ్ల రేషన్ బియ్యం పక్కదారి

(ఐదో పేజీ తరువాయి)

వచ్చిన బియ్యం బస్తాకు రెండు, మూడు కిలోల చొప్పున మిగిలిస్తూ కాప్రా, రామాంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు 900 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారు. గత నెల(జూన్) 28న విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా ఎమ్ఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేస్తుండగా అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు ప్రైవేటు లారీల్లో తరలించేందుకు ప్రయత్నించడాన్ని గమనించారు. క్లోజింగ్ బ్యాలెన్స్ షీట్, రికార్డులు సక్రమంగా ఉన్న ప్పటికీ 900ల క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎలా మిగిలాయో అధికారులకు అర్థం కాలేదు. అనంతరం అసలు విషయం బయటపడింది. కాప్రా, రామాంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు పాండురంగరాజు, కల్పనాభాయ్‌తో పాటు డీఈవో(ఆపరేటర్లు) శ్రీవాణి, హుస్సేన్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రశాంత్‌లను అధికారులు సస్పెండ్ చేశారు. దాదాపు రూ.25 లక్షల విలువ చేసే 900ల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, 3 లారీలను అధికారులు సీజ్ చేశారు.

విచారణ కొనసాగుతోంది

కాప్రా, రామంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలతో పాటు మరో ముగ్గురిపై విజిలెన్స్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. రేషన్ బియ్యం పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరుగకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాం. రికార్డులు సరిగానే ఉన్నాయి. అక్రమంగా బియ్యం ఎలా నిల్వ చేశారనే అంశంపై విచారణ జరుగుతోంది.

- సుగుణాబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజరు, మేడ్చల్

జుంటువాగు కబ్జా?

(ఐదో పేజీ తరువాయి)

హైదరాబాద్‌కు చెందిన డాక్టర్.సంతోష్‌కుమార్, వీణ ఫ్యామిలీ 17.13 ఎకరాల భూమిని 10 ఏళ్ల కిందట రైతుల నుంచి కొనుగోలు చేశారు.

వాగు వెంట 8 ఎకరాల పొలం

ఇంతకాలం అరకొరగా సాగు చేసిన భూ యజమాని వ్యవసాయ పొలంలోని హద్దులు దాటి వాగు శిఖాన్ని కబ్జాకు యత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొలం దాదాపు 8 ఎకరాల మేర జుంటువాగు గుండా ఉండటంతో భూ యజమాని ఎక్స్‌కావేటర్‌తో శిఖం భూమిలో మట్టిని నింపి వాగును కబ్జా చేస్తున్నాడని చుట్టు పక్కల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యవసాయ పొలంలో నిర్మించే నిర్మాణాలు సైతం బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయి. ఈ విషయమై అక్కడున్న గోపాల్ అనే వ్యక్తితో ఈ అంశంపై మాట్లాడగా తమ పట్టా భూమిని సర్వే చేశాకే వాగు గుండా మట్టితో నింపుతున్నమన్నారు. ఈ కబ్జా అంశపై ఆ శాఖ డీఈఈ కిష్టయ్య దృష్టికి తీసుకెళ్లగా తాను సెలవులో ఉన్నానని, వాగు కబ్జా విషయం తమ దృష్టికి రాలేదన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులందరూ కలిసి ఒకటి, రెండు రోజుల్లో జాయింట్ సర్వే చేసి హద్దులు తేలుస్తామన్నారు. వాగు కబ్జాకు గురైనట్లు తేలితే కఠిన చర్యలుంటాయన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

కులకచర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. కులకచర్లలో సోమవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందన్నారు. వాటర్ ప్లాంట్, సీసీరోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్ కిషోర్ బదిలీ కాగా ఇంచార్జ్ కార్యదర్శిగా వచ్చిన సారంగపాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రామ్మోహన్‌శర్మ, పాలకవర్గ సభ్యులు భరత్‌రెడ్డి, ఎల్లయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కేఎన్‌పీఎస్ మహాసభలను జయప్రదం చేయాలి

బొంరాస్‌పేట్: ఈనెల 13న మహబూబ్‌నగర్‌లో జరిగే కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి 2వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కేఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలను నాయకులతో కలిసి విడుదల చేశారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల అందజేత

దుద్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ దాతల సహకారంతో 60మందికి సోమవారం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

మేడ్చల్ టౌన్: మేడ్చల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భూపాల్‌ను మండలానికి చెందిన రేషన్ డీలర్ల సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల నాయకులు రాజు, అనిల్ పాల్గొన్నారు

అభివృద్ధికి సహకరించాలి

మేడ్చల్ టౌన్: రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తూ అభివృద్ధికి సహకరించాలని బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్‌రెడ్డిని కోరారు. బీజేపీ నాయకులు కొత్తగా మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రప్రకాష్‌రెడ్డిని సోమవారం మర్యాద పూరకంగా కలిశారు.

పోతుల వాగు కబ్జాకు యత్నం

ధారూరు: అల్లాపూర్ శివారు వద్ద పోతుల వాగును జయలింగారెడ్డి, రసూల్ ఖాన్‌లు కబ్జాకు యత్నిస్తున్నారని నీటిపారుదల శాఖ ఏఈ నీరజ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

మోమిన్‌పేట్: మండలంలోని సుభాష్‌నగర్ ఐటీఐ శిక్షణ కేంద్రంలో గల హనుమాన్ ఆలయంలో వారం రోజుల కిందట హనుమాన్ విగ్రహం, వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలంలోని పుట్టపహాడ్‌లో అంబేడ్కర్ విగ్రహాలను ధ్వంసంచేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మొరంగపల్లి కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థుల భోజనం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మర్పల్లి/పరిగి: విద్యార్థులకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాజమల్లయ్య హెచ్చరించారు. పట్లూర్ ఎస్సీ బాలల వసతి గృహాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా పరిగిలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలను ఎంఈవో గోపాల్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారెడ్డి, సీఆర్పీ చంద్రశేఖర్‌లు ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

కులకచర్ల: ఓటరు జాబితా సవరణలో బీఎల్‌వోలు తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఆర్డీవో వాసుచంద్ర పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

బంట్వారం: మండల పరిధిలోని బోపునారం, యాచారం, రొంపల్లి, మంగ్రాస్ పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ గ్రామ కమిటీల అధ్యక్షులను పార్టీ మండల అధ్యక్షుడు దుర్గంచెరువు మల్లేశం సోమవారం ఎన్నుకున్నారు. బోపునారం అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి, రొంపల్లి హనుమంత్, మంగ్రాస్‌పల్లి రియాజ్, యాచారం సామ అంతిరెడ్డిని నియమించినట్లు ఆయన తెలిపారు.

పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

చౌడాపూర్: పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం అవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మల్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్‌కుమార్, గోపాల్‌నాయక్, చెన్నయ్య, రాము, మన్యం, కరుణాకర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

చౌడాపూర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ జనార్దన్ అన్నారు.మండలంలోని కొత్తపల్లిలోని గిరిజన బాలుర పాఠశాలలో విద్యార్థులకు సోమవారం జిల్లా పోలీసు కళాబృందంతో సైబర్ నేరాలు, డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయి, బాల్య వివాహాలు, డయల్ 100పై అవగాహన కల్పించారు.

త్వరలో అందుబాటులోకి పెట్రోల్ బంకు

బషీరాబాద్: నవాంద్గీ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకును త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని ఆ సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్లు ఎ.వెంకట్‌రాంరెడ్డి, అజయ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంకుకు వారు పరిశీలించారు.

పరిగి తహసీల్దార్‌గా వెంకటేశ్వరి

పరిగి: పరిగి తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు బదిలీ అయ్యారు. గత కొన్ని రోజుల్లో భూ వివాదాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆనంద్‌రావు స్థానచలనం కల్పించారు. ఆయనకు కలెక్టరేట్‌లోని ఈసెక్షన్‌కు బదిలీ చేశారు. ఈసెక్షన్‌లో పనిచేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరిని పరిగి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు: తొర్మామిడి 33/11కేవీ ఫీడర్ మరమ్మతులు చేస్తున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

పాఠశాలలో ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ తెలంగాణ అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో వంటమనిషి(కుక్) కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 11 సాయంత్రం 4.30 గంటలలోపు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రత్యక్ష నిరూపణ చేయాల్సి ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. శామీర్‌పేట్‌కు చెందిన బొసాల నర్సింహ(26)కు 8 నెలల కిందట వివాహమైంది. వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నర్సింహ పని మీద ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లగా తన భార్య అమీర్‌పేట్‌లోని తల్లి ఇంటికి వెళ్లింది. ఆదివారం నర్సింహ తిరిగి ఇంటికి వచ్చి తన భార్యను ఇంటికి రావాలని ఫోన్ చేయగా మద్యం సేవించడం మానేస్తేనే ఇంటికి వస్తానని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కాగా సోమవారం నర్సింహకు ఫోన్ చేయగా స్పందించ లేదు. దీంతో ఆమె అల్లుడు తిమ్మయ్య ఇంటికి వెళ్లి చూడగా తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి వెంటిలేటర్ గుండాచూడగా నర్సింహ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్క దాడిలో వృద్ధుడి మృతి

మర్పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వీధికుక్క దాడిలో వృద్ధుడు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మర్పల్లి మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన వడ్ల నాగమూర్తి(75) రోజూ మాదిరిగా శనివారం ఉదయం ఇంట్లోని చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌లో వేసేందుకు వెళ్తుండగా ఒక్కసారిగా వీధికుక్క వృద్ధుడిపై దాడిచేసి గాయపరిచింది. వృద్ధుడు కేకలు వేయడంతో గమనించిన స్థానికులు కుక్కను బెదరగొట్టారు. అప్పటికే వీధికుక్క నాగమూర్తి ముక్కు కొరికేసింది. దీంతో తీవ్రగాయాలపాలైన నాగమూర్తిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఇదిలా ఉండగా, గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, కుక్కలను నివారించాలని సోమవారం గ్రామస్థులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కాగా నాగమూర్తి కుటుంబాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్ తదితరులు సోమవారం పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

ఘట్‌కేసర్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో ఓవ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. అదే గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లు సింగారం సుక్కయ్య మరో ఇద్దరి సాయంతో మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. విచారణ చేపట్టిన పోలీసులు మృతుడు ముషీరాబాద్, కవాడిగూడ, ముగ్గు బస్తీకి చెందిన వడ్లూరి లింగం(45)గా గుర్తించారు. అతడు పాతబస్తీలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్తతున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడని మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శరీరంపై ఉన్న గాయాల ఆధారంగా లింగంను హత్యచేసి చెరువులో పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ పరశురాం తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..



షేక్ బాసిత్ (ఫైల్)

కీసర, జూలై7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నారపల్లికి చెందిన షేక్ బాసిత్(44), స్వామిలు టెంట్‌హౌస్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం పనిలో భాగంగా తమ బైక్‌పై రాంపల్లి నుంచి నాగారం చౌరస్తా వైపు పనినిమిత్తం వస్తున్నారు. సరిగ్గా వీఆర్ఆర్ ఫంక్షన్ హాల్, జుడియో షోరూం ఎదుట, సత్యనారాయణ కాలనీకి వెళ్లే దారిలో కంకరరాళ్లు తేలి ఉండటంతో బైక్ అదుపుతప్పింది. దీంతో వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌పైకి ఎక్కియడంతో షేక్ బాసిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్వామికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కాగా నాగారం నుంచి యంనంపేట్ వరకు రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. పనులు చేపట్టి సంవత్సరం గడుస్తున్న పనులు ఇంకా పూర్తి కాలేదు. రోడ్డుకు ఇరువైపులా పోసిన కంకరతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. షేక్‌బాసిత్ మృతికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు రంగంలోకి దిగి వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాగా షేక్‌బాసిత్‌కు నలుగురు పిల్లలు ఉన్నారని, వారి భవిష్యత్తు ఏంటని పలువురు ఘటనాస్థలంలో ఆవేదన వ్యక్తంచేశారు.

దాడి ఘటనలో వ్యక్తి..

దౌల్తాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడిచేసి మృతికి కారణమైన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాయిపల్లికి చెందిన కానగడ్డ లక్ష్మిపై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన ఆటో కాశప్ప లైంగికదాడికి యత్నించగా ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి ఆటో కాశప్ప పారిపోయాడు. దీంతో లక్ష్మి తన భర్త నర్సప్పకు విషయాన్ని తెలపగా వారిద్దరూ కలిసి ఆటో కాశప్ప సోదరుడు నర్సప్ప దగ్గరికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలిపారు. ఈ క్రమంలో ఆటో కాశప్పను పిలిపించి మాట్లాడుతుండగా ఆటో కాశప్ప, భార్య వెంకటమ్మ, పెద్ద నర్సప్ప, అశోక్, నరేశ్, సత్యమ్మ, ఎల్లమ్మలు కలిసి నర్సప్పపై పిడిగుద్దులతో దాడిచేశారు. ఘటనలో గాయపడిన నర్సప్పను చికిత్స నిమిత్తం దౌల్తాబాద్ మండల కేంద్రానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

వివాహిత అదృశ్యం


శశికళ

పరిగి,జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అదృశ్యమైన ఘటన పరిగి మండలం చిట్యాల్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డమీది యాదయ్యకు, షాబాద్ మండలం షాబాద్ గ్రామానికి చెందిన శశికళతో గత 17ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. యాదయ్య ఎలికట్టలోని పెట్రోల్ పంపులో పని చేస్తుంటాడు. ఈనెల 5వ తేదీన యాదయ్య పెట్రోల్ పంపులో డ్యూటీకి వెళ్లగా 6వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పటికే యాదయ్య భార్య ఇంట్లో లేదు. అమ్మ ఎక్కడికి వెళ్లిందని పిల్లలను అడగగా బయటికి వెళ్లిందని సమాధానం ఇచ్చారు. యాదయ్య తన భార్య గురించి పొలం దగ్గర, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యాదయ్య సోమవారం పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.